# అత్త అమ్మ

-రమాదేవి జాస్తి

నాన్న పోయినట్టు 'టెలిగ్రాం' వచ్చింది.

ఒక్కక్షణం నన్ను నేను నమ్మలేకపోయాను. రెండుమూడుసార్లు దాన్ని చదివి 'నిజమే'నని నిర్ధారించుకున్నాక, ఎంత సంతోషం వేసిందో? పూర్వం రావణాసురుడూ, నరకాసురుడూ లాంటి రాక్షసులు చచ్చిపోతే ముల్లోకాలూ సంతోషించాయీ అంటారే– అంతకన్నా ఎక్కువగానే సంతోషించాను. గొప్ప పీడ వొదిలిపోయినందుకు ఎంతో నిశ్చింతగా అన్పించింది. దేవతలు పూలవాన కురిపించే వుంటారు తప్పకుండా. నాక్కన్పించలేదు. అంతే!

ఎంతైనా కన్నతండ్రి కదా, మనసులో ఎక్కడో మూల బాధపడకుండా వుంటానా, వోదార్చాలని కాబోలు, లలిత నావేపే చూస్తోంది అప్పట్నుంచీ–పిచ్చిది. నేను, లలితను చూస్తూ కులాసాగా నవ్వేను.

"అదేమిటి? అట్లానే కూచున్నావు. వెళ్ళవా ఏమిటి?" లలిత ఆశ్చర్యంగా అడిగింది.

నేమేమీ జవాబివ్వక పోవడం చూసి–దగ్గరగా వచ్చి నాచేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ అనునయంగా చెప్పింది– "విష్ణు, మీ అమ్మ కోసమైనా వెళ్ళిరా!"

అయ్యో! నా సంతోషంలో పడి కొట్టుకుపోతూ అమ్మ గురించే ఆలోచించలేదు నేను.

అమ్మకోసం మావూరు బయల్దేరేను.

OOO

అమ్మ!

అమ్మంటే నాకెంతో యిష్టమో?! నా బాల్యమంతా అమ్మతోనే ముడిపడి వుంది. కానీ, అమ్మ? అమ్మంటే తీరిక లేని యంత్రం. అంతులేని దుఃఖం. అందుకే నా బాల్యం నిండా అమ్మ కన్నీటి చెమ్మనే. ఆమె నెప్పుడూ తడి తడి కళ్ళతోనే చూసిన జ్ఞాపకం. నా జ్ఞాపకాలన్నీ ఆవిడ దుఃఖపు చారలే. నాన్న, నాయనమ్మ, అపుడప్పుడొచ్చిపోయే మా యిద్దరు మేనత్తలూ, అందరూ కలిసి మా అమ్మ కంటితడి ఆరకుండా జాగ్రత్తపడేవారు.

మా అత్తలు పండుగలు–పబ్బాలు, పురుళ్ళు–పుణ్యాల పేరుతో సంవత్సరంలో సగం రోజులు యిక్కడే కాలక్షేపం చేసేవారు. పెళ్ళాం, బిడ్డల్ని చూసిపోవడానికి తరచు మా మామయ్యలు దిగబడేవారు. మా నాయనమ్మ అల్లుళ్ళకు రాచ మర్యాదలు జరిపించేది. వాళ్ళందరికీ వొండి వార్చేందుకు మా అమ్మకి యిరవై నాలుగ్గంటలూ సరిపోయేవి కాదు. రోజుకి రెండుసార్లు కాఫీ టిఫిన్లు, రెండుసార్లు నాలుగేసి కూరల్తో భోజనాలు–ఇవికాక మధ్య మధ్య పళ్ళు, చిరుతిళ్ళు–ఇన్ని రకాలూ నిమిషాల మీద మంత్రం వేసినట్టు మాయం చేస్తుండేవాళ్ళు వాళ్ళందరూ కూచుని. చిన్నపుడు నాకు ఆశ్చర్యంగా వుండేది–వాళ్ళట్లా రోజంతా పిండిమర మాదిరి నోరాడిస్తూ, వాపిరిగా తింటుంటే . ఆ వొక్కటే వాళ్ళకి తెలిసిన విద్య అయినట్టు, ఆ వొక్క పనికోసమే బ్రతుకుతున్నట్టు కన్పించేవాళ్ళు. మా నాయనమ్మ మాత్రం వాళ్ళ కట్లా పెట్టగలిగినందుకు సంతోషపడుతుండేది.

మా అమ్మ ఎన్నడూ, ఎవరినీ పల్లెత్తుమాట అనేది కాదు. చాలా తక్కువ మాట్లాడుతూ, ఎక్కువగా పనిలో మునిగిపోయి కన్పించేది. గంగిగోవులాంటి మా అమ్మపట్ల, చీకట్నే లేచినప్పటినుండీ రాత్రి నిద్రపోయే వరకూ గొడ్డులా చాకిరీచేస్తూ అందరికీ అన్నీ అమర్చి పెట్టే మా అమ్మపట్ల వాళ్ళకి అంతద్వేషమూ, చిన్నచూపు ఎందుకో నాకప్పుడు అర్థమయ్యేది కాదు. కాని, యిప్పుడనుకుంటాను– అది 'ద్వేషం' కాదు– ఒక రకమైన చులకన భావం.

మా అమ్మ తీరిగ్గా తిండి తినడం కాని, స్థిమితంగా పది నిముషాలు విశ్రాంతి తీసుకోవడం కాని నేనెప్పుడూ చూడలేదు. ఇంటి పని, వంటపని, పిల్లలపని, నాయనమ్మ పని, నాన్నపని–వొకటేమిటి?

అన్ని పనులు, అందరి పనులు అమ్మ నెత్తిమీదవే వుండేవి. ఎంత తవ్వినా తరగని మహాపర్వతం మాదిరి, ఎంత చేసినా తరగని పని. ఎప్పుడు చూసినా యింకా మిగిలి వుండే పని. ఒకదాని తర్వాత వొకటిగా నాయనమ్మ పడక్కుర్చీలో కూర్చుని పురమాయిస్తూనే వుండేది.

మా నాన్న వెలగబెట్టింది గుమస్తా ఉద్యోగమే అయినా, యింట్లో మాత్రం 'కలెక్టర్' దర్జా వెళ్ళబోసేవాడు. అరణ్యావాసానికెళ్ళి అష్టకష్టాలూ పడినవాడి మాదిరి ఆపసోపాలు పడేవాడు యింట్లో వున్నంతసేపూ. పొద్దున్నేస్తే పళ్ళు తోముకోడానికి పండుంపుల్ల అందించడం దగ్గర్నుంచీ రాత్రి పడుకున్నపుడు కాళ్ళదగ్గర సిద్ధంగా పెట్టిన దుప్పటి మడత విప్పి గొంతుదాకా కప్పడం వరకూ అమ్మ చేయవల్సిందే. పాపం, రెండు పన్లు మాత్రం ఆయన సొంతంగా చేసుకు తీరాల్సి వొచ్చేది. అవి కడుపుకి మింగడం వొకటి అయితే, టాయ్‌లెట్‌కి పోవడం మరొకటీను.

అంత అగ్గగ్గలాడుతూ అమ్మ క్రిందమండీ వోటి దాకా అన్నీ అమర్చి పెడ్తూనే వున్నా–ఎప్పుడేనా ఓ నిముషం కాస్త అటూ యిటూ అయితే చాలు. మా నాయనమ్మ కాచుకొని వున్న పులిలా విరుచుకుపడేది–అమ్మ మీద. "మగవాడు సవాలక్ష పన్లమీద బయట తిరిగి తిరిగి అలసిపోయి వస్తాడు. కాస్త ఆజాపజా కనుక్కోవాలని అనుకోవుగదా?" అని రంకెలు వేసేది అంబోతు మాదిరి.

ఆ సవాలక్ష పన్లేమిటో నాకు చిన్నవుడు తెలీదు కాని, పెద్దవాడినవుతున్న కొద్దీ అర్ధమైంది, క్లబ్బుల్లో తాగి, పేకాడ్డవూ, మెరకవీధికెళ్ళి వొంటి దురదతీర్చుకురావడవూనని, దానిక్కూడ అమ్మనే తప్పపట్టేది నాయనమ్మ–"ఇంట్లో ఆడది యీసురోమంటూ వుంటే కాస్తకండా, గుండె వున్న మగాడు తిరక్క ఏం చేస్తాడూ?" అనేది అమ్మని యీసడింపుగా చూస్తూ. "అవి కండా, గుండే వుండి చేసేపన్లు కాదు, ఒంటికి కావరం పట్టి చేసే పన్లు." అని నేను మొదటిసారి గొంతు విప్పిన రోజున యింట్లో పెద్ద యుద్ధమే జరిగింది. నాపీవు విమానం మోత మోగింది.

అమ్మకి అరడజను కాన్పులైనా, నేను, మాఅక్క మాత్రమే బతికి బట్టకట్టేం. ఉన్నది యిద్దరమే అయినా మాకే ముద్దుముచ్చట్లూ దక్కలేదు నాన్న నుండి కాని, నాయనమ్మ నుండికాని. అందువల్ల అస్తమానం అమ్మ కొంగుపట్టుకుని తిరుగుతుండేవాళ్ళం. "కొడుక్కు యిప్పట్నించే మా మీద నూరిపోసి, మాతో యుద్ధానికి తయారు చేస్తున్నావు గావన్ను. ఎన్ని చేసినా మీరు నా కొడుకు కాలిక్రింద చెప్పల్లా బతకాల్సిందే" అన్నది మా నాయనమ్మ గర్వంగా. మానాన్న అమ్మ మాట జవదాటడు: తల్లీ కొడుకు లిద్దరిదీ వొకటే మాట.

"ఎందుకు చిన్నా ఆమెని రెచ్చగొట్టడం? చూడు



## చిగురు పూసిన రహస్యం



రాత్రి అలా గుర్తొస్తూనే ఉంటుంది
అమలిన స్వప్నం వెంటాడుతుంది
రెప్పల చాటున కల రహస్యమౌతుంది
తెల్లారితే జీవితమౌతుంది

శ్వాస కళ్ళెదురే ఉంటుంది
ఈక్షణమాత్రమూ వ్యవధి పుట్టదు
పరాధీనత కాచుక్కూర్చుంటుంది
గేలానికి చిక్కటమే కార్యమౌతుంది

నీటి పువ్వు విప్పారుతుంది
దిగంతాల అంతర్మథనం తొలుస్తుంది
వ్యూహం ఖరారవుతుంది
గుండె ఆయుధమవుతుంది

రెక్కలు తడిముద్దలవుతాయి
పరుగులు ఆవిర్లవుతాయి
సందేహం జ్వలించే సముద్రమవుతుంది
కవిత్వం అసలు దారవుతుంది
మోడుకి కవిత్వం చిగురవుతుంది

సురేశ్‌చంద్ర

ఎన్ని దెబ్బలు తిన్నావో?" అస్తిపంజరం లాంటి అమ్మ నా వీపుమీద తేలిన వాతల్ని చూసి దుఃఖంతో వెక్కిపడింది.

"నువ్వు మాత్రం నీ భార్యనిట్లా కాల్చుకు తినకు. మనిషిగా చూడు. నా కర్మ పట్టనివ్వకు," అన్నది అమ్మ నా వీపున కొబ్బరినూనె రాస్తూ.

ఆ రోజుతో నాకింక మానాన్న, నాయనమ్మల భయం పోయింది. నేనా రోజునే దృఢంగా నిశ్చయించుకున్నా- ఎన్ని దెబ్బలు తిన్నా సరే, అమ్మకోసం ఆ రాక్షసుల్ని ఎదిరించి తీరాలని, అట్లా అనుకున్నాక నాకు చాలా ధైర్యం వచ్చింది. వాళ్ళని నిర్భయంగా ఢీకొనడం ప్రారంభించేను. దానివల్ల అమ్మ పరిస్థితి అద్భుతంగా మారిపోకపోయినా-నేనున్నపుడు మా అమ్మమీద దాడి చేయడం కొంచెం తగ్గించేరని అర్థమైంది.

మా అమ్మ కోసమే యుద్ధం చేయాలనుకున్నాను కాని, ఆ తర్వాత మా అక్కకోసం కూడా మరింత పోరాడాల్సి వచ్చింది- అఖర్న వోడిపోయినా. ఆడకుంకకి చదువెందుకంటూ రజస్వలకాగానే అక్కని చదువుమాన్పించచేసింది మా నాయనమ్మ. ఊరిమీద పడి జులాయి వెధవలా తిరుగుతోన్న మా పెద్ద మేనత్త కొడుక్కిచ్చి ముడి పెట్టించింది కూడా. "పెళ్ళయితే వాడే దారికొస్తాడు. చిన్నతనం కదా" అన్నది ధీమాగా. అయిన సంబంధం జారవిడుచుకోకూడదన్నది.

మా అక్కకిస్తున్నట్టుగా తన దగ్గరున్న బంగారం, తన పేరిటవున్న పొలం సగం మనవడికి ధార పోసింది. ఏడాది తిరిగేలోగా వాడా మొత్తం కరిగించేసి మా అక్కని మా యింటికి తరిమేడు.

విచ్చిన మొగ్గలా అత్తింటికెళ్ళిన మా అక్క మాడిన పెంకులా తిరిగొచ్చి-"నేనింక వెళ్ళనమ్మా, ఇక్కడే వుంటాను. బావ నన్ను రోజూ కొట్టి చంపుతున్నాడు," అని అమ్మని చుట్టుకొని బావురుమంది.

అక్కని దగ్గరకు పొదువుకుని వెన్ను నిమురుతూ అమ్మకూడా ఏమీ చెప్పలేక దుఃఖంతో కరిగి నీరయింది. ఏం చెయ్యాలో తెలియక, నీళ్ళు నిండిన కళ్ళతో, మండిపోతున్న గుండెల్తో ఆ యిద్దరాడవాళ్ళ దుఃఖప్రవాహంలో కొట్టుకుపోతూ నిలబడిపోయేను నిస్సహాయంగా. కసి-మానాన్నని, నాయనమ్మని చంపేసి మా అమ్మని, అక్కని రక్షించుకోవాలన్న కసి.

"సంసారమన్నాక సవాలక్ష గొడవలుంటాయి. దానికోసం మొగుడి వొదిలేసి పుట్టింట్లో పడివుంటారా? ఎంత అప్రతిష్ఠ? నేను నచ్చచెప్తాలే బావకి, పద పద," మంటూ నాయనమ్మ అక్కని బలవంతాన బయలుదేర దీసింది. నాన్నకూడా వంత పాడేడు. చావైనా, బతుకైనా పెళ్ళయిన ఆడదానికి మొగుడి చేతుల్లోనేనని, అట్లా వొచ్చేయకూడదని అక్కని కోప్పడ్డాడు.

కసాయి వెంట మేకలా అక్క, నాయనమ్మతో వెళ్తుంటే అమ్మ, నేను దిగాలుగా చూస్తూండిపోయేం. నాయనమ్మ తిరిగొచ్చాక పదో రోజున కబురొచ్చింది-అక్క వంట చేస్తూ చీరంటుకుని కాలిమసై పోయిందని. అంతా అబద్ధమని, బావకొడితే తగలరాని చోట దెబ్బతగిలి అక్క చచ్చిపోతే, ఆ తర్వాత అందరూ కల్సి కిరసనాయిలు పోసి అంటించారన్నది యిరుగు పొరుగుల ద్వారా మాకు తెలిసిన నిజం.

మా నాయనమ్మకాని, అత్తమామలు కాని, అక్క మొగుడు కాని-చచ్చి పోయిన మా అక్క గురించి కాక పోలీస్ కేసు కాకుండా జాగ్రత్త పడటం గురించే భయపడ్తూ, బాధపడ్తూ మాట్లాడుకొన్నారు. మా నాన్న మహానుభావుడు కూడా వాళ్ళతోనే వున్నాడు జతకల్సి. ఆ మానవ మృగాలమధ్య మా అమ్మ, నేను మహా వొంటరులమై పోయినట్లు విలవిల్లాడిపోయేము దుఃఖంతో.

"ఈ భూమ్మీద ఆడ్డై పుట్టటం కన్నా అడవిలో మానై పుట్టడం మేలు, పోనీ, చచ్చిపోయి అయినా సుఖపడతుంది నా చిట్టితల్లి, నా జన్మకా అదృష్టం కూడా లేదు" అమ్మ ముఖాన చెంగుకప్పకొని నిలువెల్లా నీరయినట్టు ఏడ్చింది. ఉప్పెనై విరుచుకు పడ్డ ఆ దుఃఖాన్ని తట్టుకునేందుకు నాకు అమ్మ, అమ్మకి నేను ఆసరా అయ్యేము. అయితే అది వొక్కనాటితో తీరేది కాదుకదా?!

"నాయనా, నువ్వు మాత్రం నీ భార్యకిట్లాంటి గతి రానివ్వకు. మనిషిగా బతుకు. కట్టుకున్నదాని వుసురు మూటకట్టుకోకు," అంత విచారంలోనూ అమ్మ నన్ను అర్థించింది.

అమ్మ సాక్షిగా నిశ్చయించుకున్నా- నా భార్యని అపురూపంగా చూసుకోవాలని, ఎట్లాంటి కష్టమూ రానివ్వకూడదని.

అప్పుడు నా వయసు పదిహేనేళ్ళు.

అక్క మరణం తర్వాత అమ్మ మరింత మూగదైపోయింది. మాటలే మర్చిపోయింది. నాకో విషయం బోధపడింది.

మా అమ్మకి చదువు లేదు. సంపాదించుకునే శక్తి లేదు. పుట్టినింటి అండదండలు, ఆస్తిపాస్తులు అసలే లేవు. ఈ యింట్లో కష్టాలు, అవమానాలు భరిస్తూ యిట్లా బ్రతకాల్సిందే తప్ప మరో

దారిలేదు. అందుకే ఆరోజు నాయనమ్మ అంత ధీమాగా అన్నది మేము మా నాన్న కాలి క్రింద చెప్పుల్లా బతకాల్సిందేనని.

ఈ యింటి నుండి, రాక్షసుల్లాంటి ఈ మనుష్యుల నుండి బయట పడాలంటే వొక్కటే మార్గం– నేను బాగా చదివి, మంచి ఉద్యోగం సంపాదించుకుని, అమ్మని నాతోపాటు తీసికెళ్ళిపోవాలి. అప్పుడు కాని వాళ్ళ మొహమ్మీద చెప్పుతో కొట్టినట్లుండదు.

అదే లక్ష్యంతో కష్టపడి చదివేను. నా వయసుతో పాటే నాకు, మానాన్నకు మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. చిత్రంగా, మా నాయనమ్మ నన్ను మంచి చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించింది.

దానిక్కారణం నాకు వుద్యోగం వచ్చాక తెలిసింది, మా చిన్నత్త కూతుర్ని నాకంటగట్టేందుకే ప్రయత్నమని. మా అమ్మకి పూచిక పుల్లంత విలువయినా యివ్వని మా అత్తకి నేను అల్లుడిని కావడమా?

చచ్చినా చేసుకోనని కరాఖండీగా చెప్పేను. నాన్న అరువుల్ని, నాయనమ్మ సాధింపుల్ని, ఆఖరి అస్త్రంగా నామీద ప్రయోగించిన అమ్మ వేడికోలుని పట్టించుకోలేదు నేను. వాళ్ళపట్ల భయం కొద్దీ అంటున్నది కాని అమ్మకు మాత్రం యిష్టమా?!

లలితను వర్ణాంతర వివాహం చేసుకుంటున్నానని యింట్లో చెప్పిన రోజున నా కాయింటితో బంధం తెగిపోయింది. నాన్న, నాయనమ్మ నన్ను చచ్చిపోయినవాడికిందే జమకట్టామన్నారు. ప్రాణాల్ని కళ్ళలోకి తెచ్చుకుని దీనంగా చూస్తూ నిలబడ్డ అమ్మని నాతో వచ్చేయవలసిందిగా ప్రాధేయపడ్డాను. పక్షవాత మొచ్చి మంచానపడి వున్న మా నాయనమ్మని, ఎక్కడ నాతో వచ్చేస్తావంటుందోనని లోపల దడవుద్తున్నా పైకి బింకంగా నిలబడ్డ నాన్నని మార్చి మార్చి చూస్తూ మా అమ్మ నిర్లిప్తంగా చెప్పింది–

"నువ్వెళ్ళిపో చిన్నా! ఎక్కడున్నా సుఖంగా బతుకు. కోడలికి నాఆశీస్సులని చెప్పు. అంతకన్నా నేనేమివ్వగలను?" ఆమె గొంతులో అణగని దుఃఖం సుడులు తిరిగింది.

ఆ తర్వాత నేనా యింట్లో అడుగు పెట్టలేదు. ఎనభై ఏళ్ళు బతికిన నాయనమ్మ మా అందరి వుసురు పోసుకుని మంచంలో తీసుకుని తీసుకుని చచ్చిపోయిందని తెలిసింది. ఇప్పుడు మానాన్నదే ఆశ్చర్యం– తొందరగానే పోయేడు. మా అమ్మకిట్లా విముక్తి లభించిందన్న మాట. ఇంతకాలం తర్వాత అమ్మని చూడబోతున్నానన్న ఆనందం నన్ను వుక్కిరి బిక్కిరి చేస్తోంది.

ఊరిలో బస్ దిగాక అనిపించింది– అమ్మకోసం ఏమైనా తీసికెళ్ళాలని. ఎదురుగా పూలకొట్టు కనిపించింది. అమ్మకి పువ్వులంటే యిష్టం. రోజూ స్నానం చేసి జుట్టుముడి చుట్టుకోగానే ఏ మందార వువ్వో, గన్నేరువువ్వో తల్లో గుచ్చుకునేది. ఏ వువ్వూ లేని రోజున రెండు తులసీదళాలు కోసయినా పెట్టుకునేది, బొట్టు పెట్టుకున్నాక. పెద్ద వువ్వలపొట్లం తీసుకుని రిక్షా ఎక్కాను.

ఇంట్లో మార్పేమీ లేదు– నాయనమ్మ పడక్కుర్చీ, మా నాన్న పవళించే వుయ్యాలబల్లా ఖాళీగా వున్నాయంతే. అమ్మ లోపలి గదిలో ఓ చాపమీద గోడవానుకుని కూర్చుని వుంది ముఖాన కొంగు కప్పకుని. అమ్మ పక్కన కూర్చుని భుజం మీద చెయ్యి వేసేను.

అమ్మ కళ్ళు తెరిచి చూసింది. నాకేం మాట్లాడాలో తోచలేదు. ఎప్పుడూ మా మధ్య మౌనమే కదా ఓదార్పు? అందుకే దానినే ఆశ్రయించేను. అమ్మ రెండు చేతుల్తో నా చేతిని గట్టిగా పట్టుకొని అట్లానే కూర్చుంది నిశ్శబ్దంగా.

కాస్సేపటి తర్వాత నేను వువ్వల పొట్లం తీసి అమ్మకిచ్చేను అపురూపంగా. అమ్మ వాటిని అందుకుని నిర్ఘాంతపోతూ రెప్పవాల్చకుండా చూసింది వాటికేసి. ఆ తర్వాత హఠాత్తుగా నీళ్ళ కుండ బద్దలైనట్టు ఘొల్లుమని ఏడ్చింది.

నేను స్పృహలో కొచ్చేను. ఇంక అమ్మ వువ్వులు పెట్టుకోదు గావన్ను. నాన్న బ్రతికి–అప్పుడు నవ్వుల్ని, చచ్చి–యిప్పుడు వువ్వుల్ని దూరం చేసేడు అమ్మకు. దుర్మార్గుడు! నేనులేచి యివతలికి వచ్చేను.

ఇక్కడ వ్యవహారాలన్నీ చక్కబెట్టి అమ్మని తీసుకుని బయలు దేరేప్పటికి యిరవై రోజులు పైనే అయింది.

"మీ నాన్న నీకోసం ఏమీ మిగల్చనే లేదు చిన్నా!" అన్నది అమ్మ శూన్యంగా వున్న వట్టింటికేసి చూస్తూ.

"నిన్ను ప్రాణాల్తో మిగిల్చాడు. నా కదిచాలదూ?!" నేను అమ్మ వొడిలో తలదాచుకున్నా.

ఆస్తి అంతా అమ్మితే కాని అప్పులు తీరలేదు. నిరాధారంగా మిగిలింది అమ్మ. అయితేనేం, నేను లేనూ? తల నిమురుతోన్న అమ్మస్పర్శ గొప్ప సంతోషాన్ని, ఉత్తేజాన్ని నింపుతున్నది నాలో. లలిత, పాప గుర్తుకొస్తున్నారు పదే పదే.

అమ్మ గురించి వినీ వినీ యిప్పుడు లలితక్కూడ అమ్మ బాగా తెలుసు చూడకపోయినా. తనకి కూడ ప్రేమనే అమ్మంటే.

అమ్మతో సహా ఆరోజే బయలుదేరేను.

OOO


నా యిల్లు నా చిన్ని సామ్రాజ్యం. దానికి మహారాణి నాలలిత. అమ్మకి పరిచయం చేశాము. లలిత సాదరంగా ఆహ్వానించింది అమ్మని.

చిన్నారి శారదని అమ్మకి అందించి అడిగేను "అమ్మా, పాప నవ్వితే అచ్చం అక్క నవ్వినట్లు లేదూ? పేరు కూడ అక్కదే!"

అమ్మ నా ముఖంలోకి చూసింది తడిగా ఆ చూపులో "యింకా నువ్వూ మర్చిపోలేదా అక్కని?" అన్న భావం వుంది. పాపని గాఢంగా గుండెలకి హత్తుకొంది.

అమ్మని సంతోషంగా వుంచేందుకు లలిత, నేను పోటీలు పడసాగేం. పాపతో ఆటపాటలు తప్ప అమ్మని వొక్కపనీ చేయనివ్వడం లేదు. వంటపని నేను, లలిత–ఎవరికి వీలైతే వాళ్ళం చేసేస్తాం. సెలవురోజు యిద్దరం కలిసే చేస్తాం. ఏవరం చేసినా అమ్మకి ఏమిష్టమో. ఏం తినాలని వుందో అడిగి మరీ చేస్తాం.

మాటలేరానట్లు, మాట్లాడటమే మర్చిపోయినట్లుండే అమ్మ యిప్పుడు గలగలా మాట్లాడుతోంది, గబగబా మాట్లాడుతోంది. ఎప్పుడూ అమ్మ చిరునవ్వయినా ఎరుగని నేను అమ్మ యిప్పుడిట్లా హాయిగా నవ్వుతోంటే గొప్ప విజయం సాధించిన వాడికి మల్లే



పొంగిపోతున్నా.

"చూసావా, ఎట్లా నవ్వుల పువ్వులు పూయిస్తున్నావో అమ్మ ముఖంలో?" అన్నట్లు గర్వంగా చూస్తా లలితకేసి.

"నీ సంతోషమే నా సంతోషము"న్నట్టు లలిత మధురంగా నవ్వుతుంది. చూస్తూ చూస్తూ రెండు నెలలు గడిచిపోయేయి. అమ్మకీ వాతావరణం బాగానే అలవాటైపోయింది.

"రోజూ వంట నువ్వు చెయ్యడం ఏమిటి చిన్నా?" అన్నది అమ్మ ఓ రోజు వన్నచారు తిరగమోత పెడుతున్న నా దగ్గరకొచ్చి. లలిత ఆఫీస్ నుండి లేట్‌గా వస్తానని చెప్పిందీ రోజు.

ఒక్క వంటేమిటి, బరువు పనులన్నీ నేనే చేస్తా. లలిత చెయ్యలేదని. లలితకి ఒక కాలుకి పోలియో వచ్చింది చిన్నప్పుడు. "లలిత కూడ వుద్యోగం చేస్తున్నది కదా! ఇద్దరం కలిసి యింటిపని చేసుకోపోతే కష్టం కాదూ తనకి?" నేను నవ్వుతూ జవాబిచ్చేను.

"ఏం నీ వొక్కడి జీతంతో యిల్లు నడవదా? వంటిదాన్ని వొదిలేసి ఆ ఉద్యోగం చెయ్యకపోతేనేం?"

పాపం, లలిత కష్టపడుతున్నదని కాబోలు అమ్మ తాపత్రయం? "ఇల్లు నడిచేది నా జీతంతోనే అమ్మా. లలిత జీతం వాళ్ళ నాన్నకిస్తుంది," నేను నెమ్మదిగా చెప్పేను.

"ఏమిటీ?" అమ్మ ముఖంలో అంతులేని ఆశ్చర్యం.

అవును. లలిత తండ్రి అనారోగ్యంతో రిటైరయ్యేరు. ఆ ఉద్యోగమే లలిత కిచ్చేరు. లలిత వెనక యింకా యిద్దరు చిన్నవాళ్ళున్నారు. వాళ్ళుకూడ చదువు పూర్తి చేసి వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడగలిగే వరకూ సహాయం చేయొద్దు? అదే చెప్పానమ్మతో.

"ఈ కుంటికాలి పిల్లకోసం నువ్వింట్లోంచి వెళ్ళిపోయినప్పుడు కూడ వొక్క మాట అనలేదు చిన్నా. లక్షణమైన కుర్రాడిని పైసా కట్నం లేకుండా కొట్టేసింది చాలక, యింకా కూతురు పెళ్ళయ్యాక కూడ ఆవిడ సంపాదన మీదే బతకడానికి ఆ తండ్రికి సిగ్గులేదూ? పెళ్ళాన్ని సంపాదించుకొచ్చి వాళ్ళ నాన్న దోసిట్లో పొయ్యమని చెప్పి, నువ్వేమో ఆడంగి వెధవలా గిన్నెలు తోముతూ, వంటలు చేసుకుంటూ పిల్లదాని ముడ్డిమూతీ కడుగుతూ పని మనిషిలా బః కుతున్నావా? కాస్త మగాడిలా, మొగుడిలా బతకడం నేర్చుకో నాయనా" అమ్మ వినవిసా వెళ్ళి పోయింది అక్కడ నుంచి.

నేను నిర్ఘాంతపోయేను. అమ్మేనా యిప్పుడు మాట్లాడింది? అచ్చం నాయనమ్మలా...యిదేమిటి, అమ్మకూడ మాటల్ని ఈటెల్లా, నడగళ్ళలా యిట్లా విసరగలదా? ఇది నేనెరుగని కొత్త రూపం అమ్మది. ఇంత వికృతంగా వున్నదేమిటి?

ఎప్పటికో తేరుకున్నా భుజం మీద లలిత స్పర్శతో. లలిత ఎప్పుడు వచ్చిందో, మా మాటలన్ని విన్నదేమో, గాయపడిన హృదయం కళ్ళలో కనిపిస్తుంది. అయినా పెదవులపై క్షమతో కూడిన చిరునవ్వుతో అంది.

"చిన్నా, ఆమె యిప్పుడు నీకు అమ్మ మాత్రమే కాదు. నాకు అత్తగారు కూడ. ఆ పాత్ర నిట్లాగే పోషించాలని మనకో రూలు కదా! అది ఆమె తప్పుకాదు. ఆమె స్వభావం మంచిదే. నెమ్మదిగా మన మామెని మార్చుకుందాం, బాధపడకు."

లలిత గొంతులోని ఆశావాదం నన్ను సేదతీర్చుతోంది.

For Your requirement of
quality Computer Stationery-pre-
printed, blank, EZR and Multi-part.

Please Contact:

**M/s. BANG DATAFORMS
PVT. LTD.,**

29-6-33, Ramachandra Rao Road, Suryaraopet,
VIJAYAWADA-520 002.
Phones: 432179, 436910.
Rajahmundry: Ph: 71004, 76850.
Visakhapatnam: Ph: 548022.
Guntur: Ph: 224493; 220046